
# పాల గురించి కధనం
# ఆవు యొక్క మనోగతం



ఉత్పాదకుని స్థాయిలో
స్వచ్ఛమైన పాల ఉత్పాదన

నాణ్యత మరియు కర్మాగార యాజమాన్యం
నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్
ఆనంద్

# ముందుమాట

పాలిచ్చే ఆవును లేదా గేదెను ఇంట్లో ఉంచుకొని పాలను సహకార సంఘానికి అందజేయటంతో మీ బాధ్యత తీరిపోదు. ఇప్పుడు, మన దేశం పాల ఉత్పాదనలో ప్రపంచంలో ప్రథమ స్థానానికి చేరుకున్నది. అయితే మారుతున్న పరిస్థితులలో పాలు స్వచ్ఛమైనవి, తొందరగా విరగనివి, అలాగే వ్యాధులని వ్యాపింపచేయనివి కావడం ఎంతో అవసరమైనది. ఈ స్వచ్ఛమైన పాలతో మంచి పదార్థాలు తయారుచేస్తే, మనకు మరియు మన డెయిరీకి లాభం కలుగుతుంది. దీని కొరకు మనం ఎన్నో పనులు చేపట్టాలి, ఎలాంటి వంటే.

(1) పశువులను పరిశుభ్రంగా మరియు ఆరోగ్యంగా వుంచవలెను.

(2) పశువుల పాకని పరిశుభ్రంగా ఉంచాలి.

(3) పశువులు తాగేనీరు స్వచ్ఛమైనవిగా ఉండాలి.

(4) పాలను పితికేటప్పుడు మరియు నిల్వ ఉంచడానికి శుభ్రమైన స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలు ఉపయోగించాలి.

(5) పాలు పితికే ముందు చేతులను సబ్బుతో కడుగుకోవాలి.

(6) పాల పొదుగును శుభ్రమైన నీళ్ళతోకడిగి, శుభ్రమైన ఉతికిన బట్టతో తుడవాలి.

(7) పాలను పాత్రలో పితికే ముందు ప్రతి చన్ను నుండి ఒకటి-రెండు ధారలు తీసి పారబోయాలి.

(8) పాలు పితికే వ్యక్తి - శుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉండాలి. బీడీ, తంబాకు, తమలపాకు మొదలయిన వాటిని పాలు పితికే సమయంలో ఉపయోగించకూడదు.

(9) పాలిచ్చే పశువుకు పచ్చ గడ్డిమేపాలి.

(10) పాలు పితికిన తర్వాత పొదుగుని శుభ్రమైన నీటితో కడిగి, చన్నులను జీవాణువులను నాశనం చేసే ద్రావకంలో ముంచాలి. దీనివల్ల పశువు పొదుగుకు సంబంధించిన రోగాల బారిన పడక రక్షణ పొందుతుంది.

(11) పాలను మూతపెట్టి సంఘానికి త్వరగా అందజేయాలి.


(12) పాల కేంద్రాలలో శీతలీకరణ సదుపాయం ఉన్నచో పాలను అందులో ఉంచిన పాలు పాడవకుండా ఉండును.

ఈ విషయాలన్ని అర్థం చేసుకొని, అమలు పరచి నట్లయితే, మనం సమితికి అందజేస్తున్న పాల ద్వారా అందరికి ప్రయోజనం చేకూర్చిన వాళ్ళమవగలము. రండి, మనందరం స్వచ్ఛమైన పాల ఉత్పాదన చేసే ప్రక్రియలో కలసికట్టుగా పనిచేద్దాం !


జనరల్ మేనేజర్
(నాణ్యత మరియు కర్మాగార యాజమాన్యం)
నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్
ఆనంద్ - 388 001.

# పాలు గురించి కథనం ఆవు యొక్క మనోగతం

రాజనగరి గ్రామంలో బన్వారి అనే పేరుగల పశు పాలకుడు ఉండేవాడు. అతనికి భార్య రాధ, ఇద్దరు బిడ్డలు ఉండేవారు. బన్వారి కుటుంబం సుఖసంతోషాలతో జీవనం గడుపుతూ ఉన్నారు కారణం వారి ఆవు, గంగ మరియు గేదె, జమున పుష్కలంగా పాలు ఇస్తూ ఉండేవి.



బన్వారి సుఖమయ కుటుంబం

బన్వారి గంగ, జమునల పాలు గ్రామంలోని సహకార పాల సంఘంలో పోస్తూ ఉండేవాడు. దానిలో ఎన్నో సంవత్సరాల నుండి సభ్యునిగా ఉన్నాడు. సంఘంకి పాలు అందజేయడం వల్ల అతనికి మంచి ఆదాయం వచ్చేది, ఇంట్లో ఏ వస్తువుకీ కొరత లేకుండా ఉండేది. అతనికి తిండి సమృద్ధిగా ఉండేది, పిల్లలు గ్రామంలోని పాఠశాలలో చదువుతూ ఉండేవారు, ప్రతి పండగ ఆనందోత్సాహలతో జరుపు కొనేవారు. బన్వారి, తన వద్ద గంగ లాంటి ఆవు, జమునలాంటి గేదె ఉన్నందులకు, తను భాగ్యవంతుడినని అనుకొనేవాడు. రాధ మరియు పిల్లలు కూడ గంగ, జమునలను ప్రేమగా చూసుకొనేవారు.

అయితే, ఉన్నట్టుండి, అలా ఆడుతూ – పాడుతూ జీవనం సాగిస్తున్న ఈ కుటుంబంపై విషాద ఛాయలు కమ్ముసాగాయి. గంగకు తెలియని రోగం పట్టుకుంది, అది అనారోగ్యం పాలయింది. బన్వారి, దానికి తనకు తెలిసిన చికిత్స ఇంట్లోనే చేశాడు, కాని ఉపయోగం లేకపోయింది. మెల్ల మెల్లగా గంగ ఇచ్చే పాలు తగ్గడం, చెడిపోవడం మొదలయింది. బన్వారి ఆదాయం తగ్గిపోయింది. ఇంట్లో రకరకాల సమస్యలు మొదలయ్యాయి. ఈ సమస్యలతో చికాకుపడి, రాధ వద్దని అంటున్నా, బన్వారి గంగని అమ్మాలని నిశ్చయించుకున్నాడు.



గంగ రోగం, కుటుంబం చింత, తగ్గిన ఆదాయం


అదే సమయంలో దగ్గరలోని గ్రామంలో పశువుల సంత జరుగుతున్నది. ఆ సంతలో గంగని అమ్మి, ఓ కొత్త ఆవును కొని తేవాలని బన్వారి నిర్ణయించుకొన్నాడు.



బన్వారి గంగను అమ్మడానికి సంతవైపు నడక సాగించాడు

మరునాడు గంగని తీసుకొని సంతకి వెళ్ళడానికి బన్వారి సిద్ధమవుతున్నాడు. రాధ, పిల్లలు గంగను పట్టుకొని ఏడవటం మొదలు పెట్టారు. బన్వారికి కూడ కళ్ళు చెమ్మగిల్లాయి. అయితే గుండె దిటవు చేసుకొని, భార్యకు నచ్చచెప్పి, గంగను వెంట తీసుకుని సంత జరిగే గ్రామంవైపు నడక సాగించాడు.

సగం దూరం వెళ్ళిన తర్వాత, కొంచెం సేపు సేద తీరడానికి, ఓ చెట్టు క్రింద బన్వారి కూర్చున్నాడు. అతని మనసు, ఉదాసీనంగా ఉంది. గంగను కళ్ళనీళ్ళతో చూసి ''గంగా ! నన్ను క్షమించు !'' అని నిట్టూర్పు విడిచాడు. ఇంతలో 'అన్నా' అని పిలవటంవిని తల తిప్పిచూడగా, గంగ అతనితో మాట్లాడటం మొదలు పెట్టింది ''అన్నా ! నన్ను నీ కుటుంబం నుండి దూరం చేయకు ! నన్ను అమ్మవద్దు'' బన్వారికు ఇదంతా కలా నిజమా అనిపించింది. అతను కూడా గంగతో సంభాషించడం మొదలుపెట్టాడు. ''నేనేమి చేసేది, గంగా ! నువ్విచ్చే పాలు తగ్గిపోవడం, చెడిపోవడం వల్ల మా ఆదాయం తగ్గిపోతున్నది. ఆదాయం పెంచుకోవాలంటే నిన్ను అమ్మి, ఇంకో ఆవును కొనడం నాకు తప్పదు కదా ! నాకు కూడ నిన్ను అమ్మాలంటే ఎంతో బాధగా ఉంది. నీకు ఏ వ్యాధి సోకిందో నాకు అర్థం కావడం లేదు. నీవిచ్చే పాలు తగ్గి పోయాయి, పైగా అవి చెడి పోతున్నాయి.



దారిలో గంగ బన్వారితో సంభాషిస్తున్నది

''ఇందులో నా తప్పేముంది?'' గంగ అడిగింది.

ఓ దీర్ఘమైన నిట్టూర్పు విడిచి, బన్వారి అన్నాడు, ''అవును గంగా! అంతా ఆ పైవాడి దయ''

దానికి గంగ ఎంతో దీనంగా ''ఇందులో దేవుడి చెయ్యి ఏమి లేదు. నన్ను క్షమించాలి, ఇలా అంటున్నందుకు, తప్పంతా నీది మరియు రాధ వదినదే. మీకు పశువులకొట్టాన్ని ఎలా ఉంచాలి అన్న విషయం తెలియదు'' అని అన్నది.

బన్వారి ఆశ్చర్యంగా ''నువ్వంటున్నది ఏమిటి? మేము కొన్ని తరాలనుండి పశువుల పాలన చేస్తూ వస్తున్నాము. తెలుసా'' అన్నాడు .

గంగ అన్నది: ''దీని గురించి అర్థం చేసుకోవాలంటే, నేను మీకు పాలగురించి కథని వినిపిస్తాను.''

బన్వారికి ఏమి అర్థం కాలేదు, ''పాల కథా ! అదేమిటి?''

''అవును. స్వచ్ఛమైనవి మరియు తాజా అయిన పాలను పితకటం మరియు దాని నాణ్యతను కాపాడి ఉంచడానికి పశువుల సంరక్షణ ఎలాచేయాలి, అన్న విషయాలు పాల కథలో ఉన్నాయి'' అన్నది గంగ.

''ఈ కథలన్ని నీకెవరు చెప్పారు?'' బన్వారి ఆశ్చర్యంతో అడిగాడు.

గంగ అన్నది, ''నేను, జమున ఓ రోజు మేత కొరకు పొలానికి వెళ్ళాము. అక్కడ మాకు గౌరీ, పారు అనే రెండు ఆవులు మరియు చంప అనే గేద కలిసాయి. వాటికి ఎప్పుడూ పెద్దగా జబ్బులేవి రాలేదు మరియు వాటి పాలు ఎప్పుడూ చెడిపోకుండా ఉండేవి.''

''అవునా!''

''అవును, వాటి యజమానికి పాల విషయంలో చాలా అవగాహన ఉంది. గౌరి, పారు మరియు చంప తమ బాగోగులు మరియు పాలు స్వచ్ఛంగా ఉంచే విషయాలగురించి ఎన్నో ముచ్చటించారు. నేను అదే కథను మీకు వినిపిస్తాను''.


గౌరి, పారు, చంప, గంగా జమునలకు పాల గురించి కథ వినిపిస్తున్నాయి

''సరే, అయితే వినిపించు'' బన్వారి అన్నాడు.

గంగ తన మిత్రులతో జరిగిన ఈ క్రింది సంభాషణను బన్వారికు వినిపించింది.

పారు : చెల్లీ, మీ కష్టాలు చూసి నా మనస్సు కలవరపడుతోంది. నేను, నా చెల్లెళ్ళు, గౌరి మరియు సీత మీ యజమాని ఏ విధంగా మీ గురించి మరియు పాల గురించి శ్రద్ధ వహించాలో మీకు చెబుతాము.

చంప : మా మాటలు శ్రద్ధగా వినాలి మరియు మీ యజమానికి వినిపించాలి. మేము చెప్పిన ఉపాయాలను అమలు చేసినట్లయితే, మీరు ఎప్పుడూ రోగాల పాలవరు.

గౌరి : ఇంకా అధికంగా పాలు ఇవ్వగలరు, మీ యజమానికి ఆదాయం కూడా ముందు కన్నా ఎక్కువ రాగలదు.

గంగ : చెప్పు అక్కయ్యా, మేము కూడా ఇదే కోరుకుంటున్నాము.

గౌరి : ముందుగా పాల గురించి కొద్దిగా వినండి. ఆవు లేదా గేదె ఆరోగ్యంగా ఉన్నట్లయితే, వాటి పొదుగు నుండి తీసిన పాలు కూడా ఎలాంటి దోషం లేకుండా ఉంటాయి.

చంప : పాల యొక్క నాణ్యత కాపాడాలంటే, పశువు, పశువుల పాక, పశువులకాపరి, పాలు నిల్వ ఉంచే పాత్రలు వగైరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించటం ఎంతో అవసరం. దీనితో బాటు పాలు పితికిన తర్వాత, త్వరగా సంఘం వారికి చేరవేయటం అవసరం. ఈ విషయాలపై అంతగా శ్రద్ధ చూపకపోతే, పాలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగిపోతుంది మరియు పాలు చెడి పోతాయి.

జమున : సూక్ష్మ జీవులా? నేనైతే పాలలో సూక్ష్మజీవులను ఎప్పుడూ చూడలేదు.

మిగతా అందరూ : అవును, మేము కూడా చూడలేదు.

పారు : ఎందుకంటే సూక్ష్మజీవులు ఎంత చిన్నగా ఉంటాయంటే, కళ్ళకు అవి కనిపించవు. వీటిని జీవాణువులు అని కూడా పిలుస్తారు. వాటిని కేవలం సూక్ష్మదర్శిని యంత్రం తోనే చూడవచ్చును. ఈ జీవాణువులే పాల యొక్క నాణ్యతను తగ్గిస్తాయి.



జీవాణువులను చూడటానికి సూక్ష్మదర్శిని యంత్రం

గంగ : మీరు పరిశుభ్రత గురించి చెప్పిన విషయాలు అమలు చేస్తే, పాలు చక్కగా ఉండిపోతాయా?

పారు : సరిగా చెప్పావు. చెల్లీ. శుభ్రమైన ఆవు లేదా గేదేలను, పరిశుభ్రంగా ఉన్న మనిషి, శుభ్రమైన పాత్రలో పాలు పితికితే, దానితో బాటు చుట్టుప్రక్కల ప్రదేశం శుభ్రంగా ఉంటే, పాలలో ఉండే జీవాణువుల సంఖ్య తగ్గి పోతుంది.

చంప : అలాంటి పాలను మూతపెట్టి ఉంచిన పాత్రలో ఉంచి వెనువెంటనే సమితి వారికి చేరవేస్తే, పాల నాణ్యత చాలా సేపు కాపాడబడుతుంది.

పారు : పైన చెప్పిన విషయాలన్నిటిని అమలు చేయకపోయినట్లయితే, డెయిరీ దాకా వచ్చేసరికి ప్రతి పాల బొట్టులో జీవాణువుల సంఖ్య-లక్షలలో ఉంటుంది.

జమున : నాయనోయ్ !

గౌరి : అవును, ఈ జీవాణువులు ప్రతి 15 నుండి 20 నిముషాలలో రెట్టింపు అయిపోతాయి, దాంతో పాల నాణ్యత త్వరగా తగ్గిపోతూ ఉంటుంది.


జమున : అయితే నాకొకటి చెప్పండి, స్వచ్ఛమైన పాలవల్ల మా యజమానికి ఏమిటి లాభం?

గౌరి : పాలు స్వచ్ఛంగా, శుభ్రంగా ఉన్నట్లయితే దానిని తాగే వారుకూడా ఆరోగ్యంగా ఉంటారు, వాళ్లు ప్రతిసారి అదే డెయిరీ పాలు తాగడానికి ఇష్టపడతారు, కొంటారు.

చంప : అలాంటి పాలతో తయారుచేసిన పదార్థాలు మంచి నాణ్యత, రుచి కలిగి ఉంటాయి. అలాంటి వస్తువులు త్వరగా పాడయిపోవు. దీనితో పశువుల యజమానికి మరియు డెయిరీకి ఆదాయం పెరిగిపోతుంది.

గంగ : అక్కా, మాకు పాలను శుభ్రంగా ఉంచే ఉపాయం వివరించు.

పారు : దానికొరకు, ముందు చేయువలసిన పని, ఆవు మరియు గేదెను ఆరోగ్యంగా ఉంచడం. వాటిని ఎక్కడ ఉంచుతారో , ఆ ప్రదేశం పరిశుభ్రంగా ఉంచటం ఎంతో అవసరం. మిమ్మల్ని ఎక్కడ కట్టివేస్తారు?




శుభ్రమైన మరియు ఆరోగ్యవంతమైన పశువు

జమున : మమ్మల్ని ఇంటి ముందున్న చెట్టుకి కట్టి ఉంచుతారు. మేము ఉండే చోటు చాలా అపరిశుభ్రంగా ఉంటుంది. కారణం, మూత్రం, పేడ వగైరా అక్కడే జమ అయిపోతాయి. అక్కడ శుభ్రం కూడా చేయరు. మాకు అలాంటి మురికి ప్రదేశంలోనే ఉండిపోవాల్సి వస్తుంది.

చంప : మనం ఉండే ప్రదేశం పైన కప్పు తప్పక ఉండాలి మరియు అక్కడ గాలివీస్తూ ఉండాలి. విశ్రాంతి తీసుకొనేందుకు అనువుగా ఉండాలి. దీనితో బాటు చక్కటి శుభ్రమైన తాగే నీరుని కూడా అందుబాటులో ఉంచాలి.

గౌరి : ఆ ప్రదేశాన్ని, మరియు చుట్టుపక్కల ప్రదేశం పరిశుభ్రంగా ఉంచాలి. పాలు పితికే చోట గడ్డి జమకాకుండా చూడాలి. ఆవు లేదా గేదెను కట్టి ఉంచే స్థలం, కనీసం చదును చేయబడ్డ మట్టి నేల అయి ఉండాలి. పక్కా గచ్చునేల తయారుచేస్తే మరీ మంచిది.




ఆవు లేదా గేదెను పరిశుభ్రంగా ఉన్న చోట కట్టి ఉంచాలి

గంగ : ఇంకా ఏమి చేయాలి?

గౌరి : పశువులను కట్టి ఉంచే ప్రదేశంలో, నీళ్ళు, మూత్రం కాలువ ద్వారా గొయ్యిలోకి పంపినట్లయితే ఆప్రదేశంబాగా ఆరి శుభ్రంగా ఉంటుంది.

పారు : పేడని పశువులకు దూరంగా ఎరువు కోసం తీసిన గొయ్యిలో లేదా గోబర్ గ్యాస్ ప్లాంట్ లో వేయాలి.



పేడని పశువులకు దూరంగా ఎరువు కోసం తీసిన గొయ్యిలో లేదా గోబర్ గ్యాస్ ప్లాంట్ లో వేయాలి

ఇంత పెద్ద కథ వినిపించి గంగ నిశ్శబ్దంగా నిలుచుండిపోయింది.

బన్వారి గంగ మాటలు శ్రద్ధగా వింటున్నాడు. మిగతా కథ కూడా వినాలని ఉత్సాహంతో ఉన్నాడు. అతను గంగని అడిగాడు, ''నాకు పూర్తి కథ వినిపించు. పారు, గౌరి మరియు చంప ఇంకా ఏమేమి నీకు వివరించారు?''

అప్పుడు గంగ అన్నది, ''వాళ్ళు నాకు చాలా విషయాలు చెప్పారు, అయితే మనం ఇక్కడే కూర్చొని ఉంటే సాయంకాలం అయిపోతుంది. ఇంట్లో రాధ వదిన, పిల్లలు కంగారు పడుతూ ఉంటారు, పద ఇంటికి తిరిగి వెళదాము. మిగతా కథ దారిలో నీకు చెప్తాను.''



బన్వారి గంగని తీసుకుని ఇంటికి తిరిగి వెళుతున్నాడు

బన్వారికు కూడా ఇది బాగానే ఉందనిపించింది. గంగకు కట్టిన తాడు విప్పి, దానిని తీసుకుని ఇంటి దారి పట్టాడు. కొద్ది దూరం వెళ్ళాక అతనికి అకస్మాత్తుగా ఏదో తట్టింది. అవునూ మనం సంతకి కదా వెళుతున్నాము.

ఇంటికి తిరిగి వెళుతున్నామన్న సంబరంలో ఉన్న గంగ, ఈ మాటలు విని నిస్పృహ చెంది అన్నది, ''నేను నీకు ఈ కథ ఎందుకు వినిపిస్తున్నానంటే, సరైన రీతిలో నా బాగోగులు చూస్తే, నేనెప్పుడూ అనారోగ్యం పాలవను. అందువల్ల మీకు మంచిపాలిచ్చి మీ ఆదాయము పెంచగలను. ఇంత చెప్పినా కూడా నన్ను సంతలో అమ్మాలనుకుంటావా?''


బన్వారి కొద్ది సేపు ఆలోచించి అన్నాడు, ''సరే ! ఒకసారి నువ్వు తెలిపిన రీతిలో నీ బాగోగులు చూస్తాను, ఒక వేళ నీకు నయం అయినట్లయితే, ఎప్పటికీ మాతో ఉండిపోగలవు. పద ! ... ఇక ముందు కథ చెప్పు''.

గంగ మనస్సు మరలా ఒకసారి ఆనందంతో గంతులు వేసింది. కథ తిరిగి చెప్పడం ప్రారంభించింది.

''దీని తరువాత చంప, పారు పాలు పితికే వారి గురించి ఇలా వివరించారు''.

పారు : పాలు పితికే వారు అనారోగ్యంగా ఉంటే వారి అనారోగ్య ప్రభావం పాల మీద కూడా పడుతుంది.

చంప : జలుబు, దగ్గు, విరోచనాలు, క్షయరోగం, చర్మ వ్యాధి లేదా అంటు వ్యాధులు ఉన్నా లేదా వాటి లక్షణాలున్నా, అలాంటి వారు పాలు పితకరాదు.



పాలు పితికే వారు శుచి శుభ్రంగా ఉండాలి

పారు : దెబ్బ, కురుపు పగిలినా లేదా చెయ్యి ఎక్కడైనా తెగినా, సరైన రీతిలో మలామ్ పట్టి వేసుకోకుండా పాలు పితకరాదు.

చంప : పాలు పితికే వారు శుభ్రంగా ఉండటం అవసరం. వారు వేసుకున్న బట్టలు పరిశుభ్రంగా ఉండాలి. పాలు పితికేటప్పుడు, పితికే వ్యక్తి మరియు దగ్గరలో ఉన్న వ్యక్తులు దగ్గడం కాని తుమ్మడం కాని చేయకూడదు. ఈ సమయంలో వాళ్ళు తమలపాకు, పొగాకు, బీడీ, పాన్-మసాలా లాంటివి తినడం, తాగడం చేయకూడదు.


ఇదంతా విని, బన్వారి అన్నాడు, ''నిజం చెప్పనా, గంగా, మనందరం ఈ తప్పులన్ని చేస్తున్నాము. ఇకనుంచి పాలు పితికే సమయంలో ఈ విషయాలన్ని శ్రద్ధతో పాటిద్దాము.''

ఇంత పెద్ద కథ వింటూ బన్వారి మరియు గంగ ఇంటికి చేరారు. గంగను తిరిగి ఇంటికి తీసుకురావడం చూసి రాధ, పిల్లలు చాలా సంతోష పడ్డారు. రాధ ఆశ్చర్యపడుతూ అడిగింది, ''అరే ! గంగను వాపసు తీసుకుని వచ్చారా?'' రాత్రి భోజనానంతరం కుటుంబ సభ్యులు నిద్రకు ఉపక్రమిస్తున్న సమయంలో, బన్వారి, రాధకు గంగ చెప్పిన పాల కథను వినిపించాడు. రాధ ఇదివిని ఆశ్చర్య పడింది, దాంతో బాటు ఆనందంకూడా కల్గింది. మరునాడు, బన్వారి, రాధ గంగ దగ్గరకు వెళ్ళినప్పుడు, రాధ అన్నది, ''గంగా, మీ అన్నయ్య నాకు పాల గురించి కథ వినిపించారు. నువ్వు దిగులు పడవద్దు, మేమిప్పుడు నీ బాగోగులు మీ స్నేహితులు చెప్పినట్లే చేపడతాము.''

గంగ కళ్ళనుండి ఆనందభాష్పాలు రాలాయి. అది అన్నది, ''వదినా, నేనైతే నాజీవితాంతం మీకు సేవ చేయాలని కోరుకుంటున్నాను. అయితే ఇంకా కూడా అమలుపరచవలసిన కొన్ని సంగతులున్నాయి. మీరిలా చేస్తే నేను, జమున ఆరోగ్యంగా ఉండి స్వచ్ఛమైన, పౌష్టికమైన మరియు అధికమైన పాలను మీకు అందించగలము.''


రాధ అన్నది, ''గంగా, మేమింకా ఏ విషయాలు అమలుచేయాల్సి ఉంటుంది?'' గంగ వివరించింది, ''ఇంట్లో ఉన్న దోమలు మనకి శత్రువులు. దోమలు శరీరంపై లక్షల సంఖ్యలో జీవాణువులను పుట్టిస్తాయి. ఇవి అనేకరకాల రోగాలను వ్యాపింపజేస్తాయి, పాలను చెడగొడతాయి.''

రాధ అడిగింది, ''అవునా ! దీని అర్థం దోమల బారినుండి పాలను రక్షిస్తే పాలు చెడిపోకుండా ఉంటాయా?''



ఒక దోమ శరీరంపై షుమారు పదకొండు లక్షల జీవాణువులు ఉంటాయి

గంగ : అవును, దోమలు మరియు మురికి, ఈ రెండింటి నుండి పాలను రక్షించుకోవాలి. ఆవు లేదా గేదె శరీరం మీద మురికి ఉన్నట్లయితే, దాని మీద కోట్లానుకోట్ల సూక్ష్మజీవులు ఉంటాయి.



శీతాకాలంలో పాలు పితికే ముందు పశువులను మెత్తటి బ్రష్‌తో తోమి శుభ్రంగా ఉంచాలి మరియు వేసవిలో నీళ్ళతో కడగాలి

దీని కారణంగా, పితికే ముందు వాటిని కడగటం అవసరం. వేసవి రోజుల్లో పశువులను నీటితో శుభ్రం చేయాలి మరియు చలికాలం మెత్తటి బ్రష్‌తో రుద్ది శుభ్రం చేయాలి, ఇందువల్ల జుట్టు మరియు శరీరం నుండి సూక్ష్మజీవులు తొలగి పోతాయి.


రాధ : అవునా ! ఈ విషయాలను గుర్తు పెట్టుకుంటాను.

గంగ : శుభ్రమైన పాల కొరకు పాత్రలు కూడా శుభ్రంగా ఉండాలి. పాలుంచే పాత్రలను సబ్బుతో తోమాలి. పాత్రలో మట్టిలేకుండా జాగ్రత్త వహించాలి. దానిని తోమిన తర్వాత పరిశుభ్రంగా ఉన్న స్థలంలో బోర్లించి ఆరబెట్టాలి.

రాధ : సరే

గంగ : ఆవు లేదా గేదె పొదుగు మంచి నీటితో కడిగి ఉతికిన బట్టతో తుడవాలి.

రాధ : అయితే నేను అలాగే చేస్తాను కదా !




ఆవు మరియు గేదె ప్రతి చన్నుని మంచి నీటితో కడిగి ఉతికిన శుభ్రమైన బట్టతో తుడవాలి

గంగ : నువ్వేమో నీ చీర కొంగుతో నా పొదుగు తుడుస్తావు, అది మురికిగా ఉండే అవకాశం ఉంది. అందుకని శుభ్రమైన వస్త్రాలను ఉపయోగించడం తప్పని సరి. పాలు పితికే ముందు ప్రతి చన్ను యొక్క ఒకటి రెండు ధారల పాలు తీసి పారబోయాలి. ఇలా చేసినందువల్ల చన్నులో జమ అయిన జీవాణువులు తొలగి పోతాయి.



పాలుపితికే ముందు ప్రతి చన్ను యొక్క ఒకటి-రెండు పాల ధారలు తీసి పారబోయాలి

పాలు పితికే ముందు చేతులను సబ్బుతో కడుగుకోవడం ఎంతో అవసరం.




పాలుపితికే ముందు చేతులను సబ్బుతో కడుగుకోవాలి

పాలు పితికే వారు తమ వేళ్ళను పాలలో ఎప్పుడూ ముంచకూడదు, పశువు యొక్క చన్ను పై నూనె రాయకూడదు.




వేళ్ళను పాలలో ముంచకూడదు

పాలుపితికే సమయంలో తన శరీరం యొక్క ఏదైనా అంగం లేదా బట్ట, పాలకు లేదా పాలుంచిన పాత్రలకు తగలకుండా చూసుకోవాలి.

బన్వారి : అవునా !

గంగ : చన్నులో ఏమాత్రం పాలుమిగలకుండా పిండాలి, లేకుంటే సూక్ష్మజీవులు త్వరగా అధికమవుతాయి. దీనివల్ల పశువుకు వ్యాధి సోకే అవకాశం ఎక్కువవుతుంది.


పాలు పితికిన తర్వాత చన్నులను శుభ్రమైన నీటితో కడిగి జీవాణువులను నాశనం చేసే (అయడోఫోర్) ద్రావకంలో ముంచాలి.




పాలుపితికిన తర్వాత చన్నులను శుభ్రమైన నీటితో కడిగి, జీవాణువులను నాశనం చేసే ద్రావకంలో ముంచాలి


బన్వారి : సరే, ఈ సంగతి కూడా గుర్తు పెట్టుకుందాము.

గంగ : పాలు పితికి ఆపై సంఘం వారి దగ్గరికి చేరవేసే పాత్ర, స్టెయిన్‌లెస్ స్టీలుదే అయిఉండాలి. దాని మూత గట్టిగా బిగించాలి, లేకుంటే దోమలు, మలిన పదార్థాలు అందులో పడతాయి. పాలను సత్వరంగా సమితికి చేరవేయాలి, అప్పుడే పాలు పాడవకుండా ఉంటాయి.



పాలుంచే పాత్రలను ఆరబెట్టడానికి వాటిని తోమి బోర్లించి ఉంచాలి


పాల గురించిన ఈ కథ విన్నాక బన్వారి మరియు రాధ, గంగ చెప్పిన దారిలోనే నడవడం మొదలు పెట్టారు. ముందుగా గంగకు చికిత్సను డెయిరీ పశువులకు చికిత్స చేసే డాక్టరుతో చేయించారు. సరయిన చికిత్స చేయించడం వల్ల గంగ త్వరగా కోలుకున్నది. రాధ, గంగ చెప్పిన అన్ని సంగతులను అమలుచేయడం మొదలు పెట్టింది. గంగ మరియు జమున ఉండే చోటును మరియు పరిసర ప్రాంతాన్ని రాధ, పిల్లలు బాగుచేసి పరిశుభ్రంగా చేసారు. దీని కారణంగా గంగ స్వచ్ఛమైన అధిక పాలను ఇవ్వనారంభించింది.



గంగకు చికిత్స జరిగింది, బన్వారి ఇంటికి ఆనందం తిరిగి వచ్చింది


బన్వారి కుటుంబపు ఆదాయం పెరిగింది మరియు వాళ్ళు మునుపు లాగానే సుఖసంతోషాలతో గడపటం మొదలు పెట్టారు. ఇప్పుడు బన్వారి, రాధ ఇంకా కొన్ని పాలిచ్చే పశువులను కొని ఇంటికి తెచ్చుకోవాలనుకుంటున్నారు.

పరిశుభ్రమైన ఆరోగ్యవంతమైన పశువు




(1)

పశువులను ఉంచేందుకు శుచీ శుభ్రంగా ఉన్న ప్రదేశం




(2)

తాగటానికి స్వచ్ఛమైన నీరు




(3)

పరిశుభ్రంగా ఉన్న స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలు




(4)

పాలు పితికే ముందు చేతులను సబ్బుతో కడుగుకోవాలి.




(5)

పాదుగును మంచి నీటితో కడిగి, శుభ్రమయిన ఉతికిన బట్టతో తుడవాలి




(6)

పాలు పితికే ముందు ప్రతి చన్ను యొక్క ఒకటి-రెండు ధారల పాలు తీసి పారబోయాలి.




(7)

పాలు పితికే వారు శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండాలి




(8)

పాలిచ్చే పశువుకు పచ్చ గడ్డిని తినిపించాలి



(9)

పాలు పితికిన తర్వాత చన్నులను మంచి నీటితో కడగాలి మరియు జీవాణువులను నాశనం చేసే ద్రావకంలో ముంచాలి.





(10)

పాలనుంచిన పాత్రను మూత పెట్టి సంఘం వరకు తొందరగా చేరవేయాలి




(11)

పాలను త్వరగా చల్లబరిచే యంత్రం



(12)

All rights reserved. No part of this publication may be reproduced in any form, electronic or mechanical without prior written permission from National Dairy Development Board, Anand (India).



**మీ రెప్పుడైనా విన్నారా. సంగీతాన్ని విని**
**ఆవు ఎక్కువగా పాలిస్తుందని**

పురాణాల్లో సంగీతాన్ని భగవంతుడుగా
భావించడం జరిగింది. పెద్ద పెద్ద వ్యాధులు కూడా
సంగీతం వల్ల నయమవుతాయన్న సంగతిని
ఆయుర్వేదం నొక్కి వక్కాణించింది.
పరిశోధనలవల్ల తేలిందేమిటంటే, పశువులు
కూడా సంగీతపు ఆనందాన్ని పొందుతాయి.
సంగీతం వినిపించడం వల్ల ఆవు/గేదె ఆనందం
అనుభవిస్తాయి. పాలు పితికే సమయంలో మధుర
సంగీతాన్ని ఆలపించండి, ఇక దాని ఫలితాన్ని
మీరే తెలుసుకోండి.

'Telugu' version of the original 'Hindi' book "Doodh Ki Kahani, Gai Ki Zabani"
published by NDDB, Anand.